ఉపాధి కూలీల వేతన వ్యథ

- మూడు నెలలుగా నిలిచిపోయిన చెల్లింపులు
- నియోజకవర్గ వ్యాప్తంగా రూ.15.43 కోట్ల బకాయి
- కూలీలకు తప్పని ఎదురుచూపులు



తిమ్మాపురంలో ఉపాధి హామీ కింద పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

కంబదూరు: ఉపాధి కూలీల రెక్కల కష్టంతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది. మండుటెండలో చెమటోడ్చిన వారికి కూలి చెల్లించకుండా వేధిస్తోంది. మూడు నెలలుగా కూలి బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతోంది. పొట్ట కూటి కోసం పని చేస్తే పస్తులతో అవస్థలు పడే దుస్థితి దాపురించిందని కూలీలు ఆవేదన చెందుతున్నారు. సర్కారు తీరుతో మళ్లీ వలసబాట తప్పేలా లేదని వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పేదలకు వ్యవసాయం తర్వాత అండగా ఉంటోంది ఉపాధి హామీ పనులే. అయితే మూడు నెలలుగా ఉపాధి కూలీ బిల్లులు ఖాతాల్లోకి జమవ్వక పోవడంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపాధి కూలీలకు ఏ వారంలో ఎంత పని చేసుంటే ఆ వారానికి సంబంధించిన మొత్తం కూలి బిల్లులు వారి ఖాతాల్లోకి జమయ్యేవి. ప్రస్తుతం మే 13 నుంచి ఈ రోజు వరకు కూలీలకు చెల్లించాల్సిన సొమ్ము పెండింగ్‌లోనే ఉంది.

రూ.కోట్లలో బకాయిలు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 5 మండలాల్లో 15 వేల మందికి పైగా కూలీలు ఉపాధి హామీ కింద పనులు చేశారు. వీరికి మూడు నెలలకు సంబంధించి సుమారు రూ.15.43 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు ఖాతాల్లోకి పడ్డాయో లేదో తెలుసుకునేందుకు బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొంత మంది కూలీలు ఉపాధి సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు బిల్లులు త్వరగా మంజూరయ్యేలా చూడాలని కూలీలు కోరుతున్నారు.

కుటుంబ పోషణ కష్టంగా ఉంది



వర్షాభావ పరిస్థితులతో గ్రామంలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఇంట్లో ఖాళీగా ఉంటే పస్తులు ఉండాల్సి వస్తుందని, ఉపాధి హామీ పనులకు వెళ్లాం. మండుటెండల్లో పనులు చేశాం. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. అధికారులు స్పందించి బిల్లులను ఖాతాల్లోకి జమ చేయాలి.

–హనుమంతరాయుడు, కంబదూరు

మూడు నెలలుగా అందలేదు



కూలీకి వెళ్తేనేగాని పూట గడవని కుటుంబం మాది. మే నెల నుంచి ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఖాతాల్లోకి పడలేదు. ఉపాధి హామీ సిబ్బందిని అడిగితే వస్తాయని చెబుతున్నారు. ప్రస్తుతం అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న మూడు నెలల బిల్లులను చెల్లించాలి.

– నారాయణప్ప, కంబదూరు

త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం



ఉపాధి హామీ కింద పని చేసిన కూలీలందరికీ త్వరలో బిల్లులు చెల్లిస్తాం. ఇప్పటికే ఇందుకు సంబంధించిన బడ్జెట్ ఆమోదం పొందింది. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ కూలీల ఖాతాల్లోకి జమవుతాయి. ఈ విషయంలో కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బిల్లులు అందలేదని ఎవరూ పనులు మానాల్సిన పని లేదు.

– ఉస్మాన్ అలీ, ఏపీఓ కంబదూరు

క్లుప్తంగా

సూక్ష్మబిందు పరికరాలకు రైతులు దరఖాస్తు చేసుకోండి



శీర్పిలో సూక్ష్మబిందు పరికరాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీఏఓ మల్లేష్

బెళుగుప్ప: బోరుబావులు కలిగిన రైతులు బిందు తుంపర సేద్యం సాగుకు అవసరమైన సూక్ష్మబిందు పరికరాల మంజూరుకు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంఐఏఓ మల్లేష్ పేర్కొన్నారు. గురువారం సబ్సీడీతో సూక్ష్మబిందు పరికరాల మంజూరుపై ఎంపీడీఓ సుబ్బరాజు, ఈఓఆర్డీ మాదవరెడ్డి తదితరులతో కలిసి బెళుగుప్ప, శీర్పి గ్రామాల్లో రైతులకు సూక్ష్మబిందు సాగు వినియోగం అవగాహన కల్పించారు. రైతులు ఆర్ఎస్‌కేలలో భూమి పాసు పుస్తకం, 1బీ, అడంగల్, పొలం స్కెచ్, చెక్కుబందీ, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం, కరెంటు బిల్లు తదితర డాక్యుమెంట్లతో రిజిష్టర్ చేసుకోవాలని అధికారులు సూచించారు.వివరాలకు మండల ఎంఐఏఓ సెల్: 7995010059, 9652389795లో సంప్రదించాలన్నారు.

సీసీఆర్‌సీతో కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్

కణేకల్లు: సీసీఆర్‌సీ (సాగుదారుల హక్కుపత్రం)తో కౌలు రైతులు బహుళ ప్రయోజనాలు పొందొచ్చని ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు.గురువారం మండలంలోని సొల్లాపురం గ్రామ రైతుసేవా కేంద్రంలో సీసీఆర్‌సీపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటైన సభలో ఏడీఏ మాట్లాడారు. కౌలు రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 2019లో సాగుదారుల హక్కు చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. తహసీల్దార్ ఫణికుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతిరైతుకూ సీసీఆర్‌సీ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రవణ్‌కుమార్, ఆర్ఐ అశ్వర్థనారాయణ, వీఆర్వో హనుమంతరెడ్డి, ఎంపీఈఓ బృందమ్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వాలి

కూడేరు: ప్రభుత్వం సబ్సిడీతో ఉలువలు, పెసలు, జొన్న, అలుసందలు ఇవ్వాలని మరుట్ల, కమ్మూరు, ముద్దలాపురం, ఉదిరిపికొండకు చెందిన రైతులు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు బాగా కురవడంతో వేరుశనగ పంటను సాగు చేయాలని, గంపెడు ఆశలతో విత్తనాలు, నేలను సిద్ధం చేసుకొని పెట్టుకున్నామన్నారు. కానీ వర్షం రాలేదని వాపోయారు. ఇక ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం విత్తనాలు ఇవ్వాలని కోరారు.

ఘనంగా దేవీహోమం



దేవి హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

విడపనకల్లు: పాల్తూరు పంచాయతీ పరిధిలోని ఉండబండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం దేవి హోమం నిర్వహించారు. శ్రావణమాస శుక్ల చవితిని పురస్కరించుకొని ఆలయంలో వీరభద్రస్వామికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, గణపతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌బాబు, లీలావతి, పురుషోత్తం, మంజునాథ్ దండిన శివానంద, బండెప్ప, అర్చకులు పాల్గొన్నారు.

మయూర వాహనంపై ఊరేగిన వీరభద్రుడు



మయూర వాహనంపై వీరభద్రస్వామి, భద్రకాళిదేవి

విడపనకల్లు: ఉండబండ వీరభద్రస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా వీరభద్ర స్వామి,కాళికాదేవి గురువారం మయూర వాహనంపై ఊరేగారు. వేద పండితుల ఆధ్వర్యంలో వీరభద్ర స్వామి, భద్రకాళికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఈఓ రమేష్‌బాబు ఆధ్వర్యంలో తెల్లవారు జామున సుప్రభాతం, అమ్మవార్ల అభిషేకం కుంకుమార్చన, బిల్వార్చన, దేవి హోమం, మంగళహారతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది లీలావతి, పురుషోత్తం, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై సర్వే

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంటికీ జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్ అందించాలని ఎంపీడీఓ గౌరిదేవి తెలిపారు.గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పథకం సర్వేను ఈ నెల 9 నుంచి 14 వరకు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సురేశ్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం



నాగరత్నమ్మ పెరట్లో విరబూసిన బ్రహ్మకమలాలు

కణేకల్లు:మండలంలోని కణేకల్లుక్రాస్‌లో వై.నాగరత్నమ్మ పెరట్లో బ్రహ్మకమలం పువ్వులు విరబూశాయి. ఏడాదికోసారి మొక్కకు ఐదారు లేదా పది వరకు బ్రహ్మకమలం పువ్వులు పూయడం సహజమే. వై.నాగరత్నమ్మ పెంచుతున్న బ్రహ్మకమలం మొక్కకు ఒకే సారి 30 బ్రహ్మకమలాలు పూశాయి. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఈ పువ్వులు వికసించినట్లు ఆమె తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

- గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



కొనకొండ్లలో గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు.గురువారం మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో ఎమ్మెల్సీవై.శివరామిరెడ్డి, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి, అనంతపురం మార్క్ సూపర్‌స్పెషాలిటీ గుండె ఆస్పత్రి వారు సంయుక్తంగా గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యశిబిరాన్ని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం వైద్యశిబిరంలో టుడి ఏకో, బీపీ, షుగర్, ఈ సీజీ తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎంపీటీసీ పాపన్న, మాజీ ఎంపీపీ రామచం ద్ర, మార్క్‌సూపర్‌స్పెషాలిటీ వైద్యులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల పరిశీలన



నీటి పంపింగ్‌పై అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ శాశ్వత తాగునీటి పథకాన్ని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గురువారం శ్రీనాథ్‌రెడ్డి పరిశీలించారు. తొలుత పట్టణంలోని ఫిల్టరేషన్ పాయింట్‌ను పరిశీలించి మున్సిపల్ కమిషనర్ కిశోర్, డీఈ సురేష్, ఏఈ కోదండతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి వీరాపురం పంప్‌హౌస్, కణేకల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలించారు. హెచ్చెల్సీ కెనాల్ నుంచి ఎలాంటి జాప్యం లేకుండా ఎస్ఎస్ ట్యాంకులోకి నీటి పంపింగ్ జరగాలన్నారు. ప్రస్తుతం పంప్ అవుతున్న మోటార్లకు తోడు మరో స్టాండ్‌బై మోటార్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఏడాదికి సరపడ నీరు ట్యాంకులోకి కాలువలో నీరు ఉన్నంత వరకూ సకాలంలో పంపింగ్ చేసుకోవాలన్నారు. పట్టణంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా లీకేజీలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. దీంతోపాటు అమృత్–2 కింద తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు, ఈఎల్ఎస్ఆర్ ట్యాంకుల ఏర్పాటు ప్రతిపాదనలపై కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ కోదండ పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో ఏకపక్షం



నూతన కమిటీని సన్మానిస్తున్న మండల కన్వీనర్ వన్నూర్‌స్వామి

రాయదుర్గం: నియోజకవర్గంలోని అర్బన్ సహా డీహీరేహాళ్, గుమ్మఘట్ట, కణేకల్లు, బొమ్మనహాళ్, రాయదుర్గం మండలాల్లో గురువారం 285 పాఠశాలల్లో జరిగిన మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకపక్షంగా ముగిశాయి. అన్నిచోట్లా కూటమి నాయకులు ఆధిపత్యం ప్రదర్శించారు. అధికారపార్టీ నేతల కనుసన్నల్లోనే చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక పూర్తయ్యింది.

పోటీలో నెగ్గిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు..

డీ హీరేహాళ్ మండలంలోని హెచ్.సిద్దాపురం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక రసవత్తరంగా మారింది. ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా గవిసిద్దప్ప, వైస్ చైర్మన్‌గా ఇందిరమ్మను ఎన్నుకున్నారు. ఉన్నత పాఠశాలలోనూ చైర్మన్‌గా గంగాధర, వైస్ చైర్మన్‌గా గౌరమ్మలకే మెజార్టీ సభ్యులు మద్దతుగా నిలిచారు. దీంతో రెండు పాఠశాలల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే గెలిచారు.

కేపీదొడ్డిలో ఆగిన చైర్మన్ ఎంపిక..

గుమ్మఘట్ట మండలంలోని కేపీదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. తొలుత సభ్యుల ఎన్నిక పూర్తయింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు హెచ్ఎం చంద్రశేఖర్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో ఒకే వర్గంలో తామంటే తామంటూ చైర్మన్ పదవికి పోటీ పడ్డారు. రాత్రి 7 గంటలైనా డిక్లేర్ చేయలేదు. ఎంఈఓ నాగమణి మాట్లాడుతూ.. కాస్త ఆలస్యమైన చైర్మన్, వైస్ చైర్మన్ ప్రక్రియ ముగించేలా కృషి చేస్తామని తెలిపారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా 41 ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఎంజేపీ గురుకుల పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను, కమిటీ మెంబర్‌లను ఎన్నుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ నాగమణి 1,ఎంఈఓ-2 రామచంద్ర గురువారం తెలిపారు.

రాయదుర్గంటౌన్: పాఠశాలల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్, స్కూల్ కమిటీ ఎక్స్ అఫీషియో మెంబర్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రెండో వార్డులోని మున్సిపల్ కల్లీ మఠం హైస్కూల్‌లో జరిగిన ఎస్ఎంసీ కమిటీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పార్వతి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

78 పాఠశాలల్లో ఎస్ఎంసీల ఎన్నిక :

రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని 78 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

కణేకల్లు: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతోపాటు కేజీబీవీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ స్కూల్‌లో మొత్తం 52 స్కూళ్లలో ఎస్ఎంసీ కమిటీలు ఎన్నికైనట్లు ఎంఈఓ లక్ష్మన్న తెలిపారు.

విడపనకల్లు: మండలంలో 35 ఎంపీపీ, ఎంపీయూపీ, జిల్లా పరిషత్, మోడల్ స్కూలు , కేజీబీవీ తదితర పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. పాల్తూరు,హావళిగి, ఉండబండ, చీకలగురికి, గడేకల్లు,పెద్ద కొట్టాలపల్లి, వి.కొత్తకోట, పాలికి గ్రామాల్లో ఏకగ్రీవంగా జరిగాయి.

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా 11 జెడ్పీహెచ్ఎస్‌లతోపాటు, కేజీబీవీ, రెండు ప్రాథమికోన్నత, 36 ప్రైమరీ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓలు ఈరన్న, మల్లికార్జున తెలిపారు. తూతూమంత్రంగా కమిటీల సమావేశం ఏర్పాటు చేసిన హెచ్ఎంలు అధికార పార్టీకి చెందిన సానుభూతిపరులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

బెళుగుప్ప: మొత్తం 28 ప్రభుత్వ ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత, పది జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు, ఒక కేజీబీవీలో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఎంపీడీఓ సుబ్బరాజు, ఎస్ఐ శివ, ఈఓఆర్డీ మాధవరెడ్డి తెలిపారు.

కంబదూరు: మండల వ్యాప్తంగా 58 పాఠశాలలు ఉండగా 57 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఇందులో ఎక్కువ శాతం చైర్మన్,వైస్ చైర్మన్ పదవులు టీడీపీ వారికే దక్కాయి. ఇక తిమ్మాపురం గురుకుల బాలికల పాఠశాల ఎన్నిక వాయిదా పడిందని ఎంఈఓ మదన్‌మోహన్ తెలిపారు.

శెట్టూరు: మండలంలోని 40 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 ఉన్నత పాఠశాలు, 1 ఏపీ ఎంఎస్, 1 కేజీబీవీలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు.

వజ్రకరూరు: మండలంలో గురువారం 43 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగినట్లు ఎంఈఓలు ఎర్రిస్వామి,తిమ్మప్ప తెలిపారు. మొత్తం 44 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 43 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయన్నారు. చిన్నహోతూరు జెడ్పీ హెచ్ఎస్‌లో ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఈఓలు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి సర్పసూక్త క్షీరాభిషేకం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో గురువారం నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుద్ధ చవితి సందర్భంగా స్వామికి సర్పసూక్త క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. నాగుల చవితి ప్రారంభం కావడంతో ఆలయ ప్రాంగణంలో భక్తులు పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం



వజ్రకరూరులో ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయి

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం, అర్చనలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, హారతులునిర్వహించారు.సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

కూడేరు: మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత సాయినాథుని మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. తర్వాత వివిధ రకాల పట్టు వస్త్రాలు, పూలతో విశేషంగా అలంకరణ చేశారు.

తహసీల్దార్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



శెట్టూరులో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శెట్టూరు: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఈశ్వరయ్యశెట్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమలో మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమేష్, వీరభద్రప్ప, నాయకులు రామకృష్ణ, హరినాథ రెడ్డి, ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, బలిస్వామి, రామాంజనేయులు, టైలర్ వన్నూరుస్వామి, లింగప్ప, మిద్దె సుధాకర్, మంజప్ప, నాగేంద్ర రెడ్డి, గోపి, లింగమయ్య, రాజు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధుల నివారణ



ఉద్దేహాళ్‌లో సీజనల్ వ్యాధులపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు నివారించొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి తెలిపారు. గురువారం మండలంలోని ఉద్దేహాళ్‌లో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన, జైనాబీ, సీహెచ్ఓ నాగమణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ముందుజాగ్రత్తలతోనే సీజనల్ వ్యాధులు కట్టడి

కూడేరు: దోమలు వృద్ధి చెందకుండా ముందు జాగ్రత్తలు చేపడితేనే మలేరియా, డెంగీ తదితర విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా అరికట్టొచ్చని అనంతపురం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య అన్నారు. బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్ సీఏటీసీ-4వ ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 650 మంది క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. క్యాడెట్లు రోగాల బారినపడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గురువారం దోమల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నూరు బాషా, శ్రీధర్ మూర్తి, రవీంద్ర, ఎంహెల్‌హెచ్‌పీలు చంద్రకళ, మాధవి, ఏఎన్ఎం బాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీస్వామి దర్గాలో భక్తులు గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. భక్తులు కందూరీలు చేశారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు



మార్కండేయస్వామి ఆలయంలో నాగుల కట్టకు పాలు పోస్తున్న మహిళలు



కణేకల్లులో నాగదేవత విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ: మండల వ్యాప్తంగా నాగుల చవితి పర్వదినం సందర్భంగా నాగుల చవితి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మార్కండేయస్వామితో పాటు నాగుల కట్టల వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నాగుల పుట్టకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నాగదేవత విగ్రహాల ఊరేగింపు

కణేకల్లు: కణేకల్లులోని ముల్లావారి వీధిలో నాగదేవత విగ్రహాలను గురువారం ఘనంగా ఊరేగించారు. ముల్లావారి వీధిలో బావి వద్ద శుక్రవారం వేకువజామున నాగదేవత విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని ఆ ప్రాంత వాసులు నాగదేవత విగ్రహాలను పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. వేకువజామున శాస్త్రోక్తంగా నాగదేవత విగ్రహాలను ప్రతిష్టించనున్నట్లు కాలనీవాసులు తెలిపారు.

నేడు శ్రీమద్ భగవద్గీత పురాణ ప్రవచనం

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో శుక్రవారం శ్రీమద్ భగవద్గీత పురాణ ప్రవచనం నిర్వహిస్తున్నట్లు గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గవిమఠం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి ఆదేశాల మేరకు శ్రావణశుద్ధ పంచమిని పురస్కరించుకొని ప్రముఖ ప్రవచనకర్త నారప్పస్వామి ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనం నిర్వహిస్తామన్నారు.

కూడేరులో మోస్తరు వర్షం

కూడేరు: మండలంలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం కూడా కొద్దిసేపు తేలిక పాటి వర్షం కురిసింది. ముందస్తుగా సాగు చేసిన వేరుశనగ, ఆముదం, కంది పంటలు వర్షా భావంతో ఎండు ముఖం పట్టి దెబ్బతింటున్నాయి. చాలా రోజుల తర్వాత వర్షం కురవడంతో ఎండుతున్న పంటలకు ఉపశమనం కలిగినట్టు ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

కళ్యాణదుర్గం రూరల్: ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (1984–2024) నాలుగు దశాబ్దాలుగా చదివిన విద్యార్థులు అందరూ ఈనెల 10న హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి గురువారం తెలియజేశారు. ఈనెల 21,22న ఎన్ఏఏసీ బృందం కళాశాలను సందర్శించనున్నట్లు తెలిపారు.